శ్రీ

మతవిఘులేరీతిగఁ బ్రబలినది.

ఇది

బళ్ళారిలో వకీలుగానుండి

కీ. శే. బ్రహ్మశ్రీ॥ కోలాచలం శ్రీనివాసరావుగారిచే

రచియింపఁబడినది.

వారి జ్యేష్ఠపుత్రుఁడగు కె. శత్రుఘ్నరావుచేఁ

ప్రకటింపఁబడియె.

మొదటికూర్పు.

బళ్ళారి.

ఆంధ్రముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1926.

వెల అ. 0—8—0

ఆగముల తత్త్వము.

Annalysis of Religion.

మానవుల పలువిధములగు విమర్శనలకుఁ జిత్రమహిమలు జూపువిషయములలో నెల్ల, మతసాంబంధిక విషయ, మతివిచిత్రముగనున్నది. సకలవిధములగు ద్వంద్వప్రకృతులకు స్థానమగు మన శారీరభాగమున మతమొక ముఖ్యవిషయముగ నున్నది. కావున, దానితత్త్వమొక విమర్శనవిషయముగ నెవ్వారును నెల్లకాలములందును విచారించుచుందురు. శాస్త్రీకదృష్టిని, నా, మతతత్త్వ యాదార్థ్యమును, మనమెఱింగి వెలిబెట్టితిమేని, మనయత్నము, లోకహితముగను, లోకోపకారముగను నుండును. ప్రపంచంబునందు మతములందలిగతులు విచారించునెడల, నేమార్గ మనుసరించినచో బాగుగనుండుననునది, మనము గననగును. విమర్శించుటకు మేలుమార్గము దొరకక, యనేకులు పొరబడిన సిద్ధాంతము లొనర్చినారు. తాము విచారించు మతవిషయములో మూలాధారములుగనుండు, తత్త్వముల యాదార్థ్యములు, విమర్శనమునకు నిలుచునవియో నిలువనవియో యనునవి విచారింపకనే వాని, నిజత్వముగ నమ్మినారు. కావున వివిధమతములలో నలీకాభిప్రాయములు బుట్టుటకుఁ గారణములైనవి. కొన్ని విషయము, లనభి శంకనీయములని నమ్మి, వాని, ననుసరించి సిద్ధాంతము లనేకములొనర్చినారు. స్వర్గకవాటముగ మహమ్మదునామము వ్రాయఁబడియుండఁగ "ఇస్లాం" మతమెట్లుల బద్ధమగునని తురకలు వాదింతురు. దైవచోదిత వాక్కులుగల వేదమతమెట్లు లబద్ధమగునని హిందువులు వాదింతురు. అహూర్ మజ్దను మహాదైవము పలికిన మతవచనములెట్టులలీకములగునని పార్సీలు వాదింతురు. దేవునిపుత్రుఁడు క్రీస్తువచనముల, నిజత్వమునకు, వేఱొకటియుండునాయని క్రీస్తుమతస్థులు వాదింతురు. ఇటులనే యనేక మతములవారు మత ముఖ్యాంశమును, విమర్శింపక నమ్మి, యనేకానర్థములకుఁ గారణభూతులయిరి. తాము నమ్మినవిషయము నిర్వివాదాంశమా, యటుగాక వివాదాంశమా యనునది విమర్శనాపూర్వకముగ విచారింపరైరి. తాము బలీయమగు సాక్ష్యముపైన మత ముఖ్యాంశములను నమ్మినారా యటుగాక దుర్బలములగు నంశములపైన నమ్మినారా, యేవిచారముఁజేయక గుడ్డివారింబలె నమ్మినారా, యను విషయమునుగూడ నాలోచింపక సిద్ధాంతములొనర్చు వారనేకులున్నవారు. మతసిద్ధాంతము లొనర్చిన జ్ఞానులు తామని గర్వించినారు. అట్టి తమ

సిద్ధాంతము లంద ఱనుసరింపవలెనని కలహించుచున్నవారు. ఇతరులకంటెను జ్యూలధికులనియు, వారికి దైవానుగ్రహము సంపూర్ణముగఁ గలిగియుండెను కావున యీజిప్షియనుల బాధలనుండి పురాతన "యిజరయిలైట్సు" తప్పించుకొనిరనియు హీబ్రూలు పలుకుచున్నవారు. అన్యమతస్థు లనేకులు తాము పడరాని బాధలు పడు సమయమున తమదైవములా బాధలనుండి తమ్ముఁ గాపాడిరని గాథలువచించుచుఁ దామధికులమనుచున్నవారు. వృత్ర శంబరాద్యసురులును దస్యులును బాధించు నపుడు తమ దైవములగు నింద్రవరుణాగ్నులు వారినిఁజంపి తమ్ముఁ గాపాడిరని యార్యులు పలుకుచున్నవారు. అనేకవిధములగు భూతములు ప్రపంచమును బాధించుచుండఁ దమదైవమగు నహూర్‌మజ్డు బహువత్సరంబులు వారితోఁబోరి జయించి తమ్ముఁగాపాడెనని యీరానీలు పలుకుచున్నవారు. వివిధ మతచరిత్రములు చదివిన నట్టివిట్టిగాథలుండును కావున నిట్టి దుర్బలంబులగు సాక్ష్యములనుబట్టి మతాధిక్యత నిర్ధరించుటకు నాధారములులేవు. కానరావు. ఒకమతమువారు తమ, మతమధికమనుటకు బలమైన కారణములు చూపి వాదించుతఱి నన్యమతస్థులుసైత మవేకారణములు తమమతమునందుసైత మున్నవని స్థిరపఱచిన యెడల మొదటి వారి మతప్రాముఖ్యతకుఁ గుందుకలుగును. కావున ప్రకృతిశాస్త్రమునందును భాషా విషయకమగు శాస్త్రమునందును నుపయోగింపఁబడు పోల్పుమార్గ మవలంబింపవలెను. అనగా రెండువస్తువు లెదుటనుంచికొని వానియందు సామాన్యముగనుండు తత్త్వములెవ్వి యధికముగనుండు నవియెవ్వియనునది విమర్శింపవలెను. అటులొనర్పనిచో మతగౌరవముల తరతమములు తెలియుట కష్టమగును. శబ్దతాత్త్వికుఁడు వివిధభాషల సామాన్యతను నెఱుంగుటకునై, యాయాభాషలలో సమానార్థమిచ్చు శబ్దముల నెదుటనుంచుకొని వానికి మూలాధారములుగనుండు ధాతువులనుబట్టి యేయేశబ్దముల యందొక్కధాతువే యాధారముగ నుండునది కనుక్కొని యాశబ్దములన్నియును నొక్కతరగతిక్రిందఁ జేర్చువిధమున మతతాత్త్వికుఁడుసైత మదేపద్ధతి ననుసరించినచో నేయేమతములకు నైకమత్యముగలదు. మఱి యేయే మతములు వానితోభిన్నించునను విషయముఁ గొంతవరకు నిర్వివాదముగ నిర్ధరింపనగును. అయినను మూలాధారమగు దైవతత్త్వము నిర్ధరించుట యసాధ్యము.

ప్రాపంచక స్థితియును బ్రాపంచక చరిత్రయును జూచినమాత్రాన నొక విచిత్రమహిమ మనకు గోచరమగును. దానినుండి మనము రెండువిషయము లూహింపనగును.

[1] సర్వవ్యాపకమైనట్టియు, సర్వసామాన్యమయినట్టియు నొక తత్త్వ

మున్నదనియు [Divine Essence].

[2] ఆతత్త్వమనేక రూపములుంగొని మానవుల తలంపులలో నొక్కొక్కవిధముగ వ్యాపించినదనియు. [ఆత్మతత్త్వము]

పై రెండువిషయములు మనమీప్రపంచమునుజూచినచో స్పష్టముగ నగపడుచుండును. నాస్తికులయందును చార్వాకులయందును సైతమీతత్త్వ మొక్కొకతూరి హటాత్తుగ వెలిపడుచుండును. మతములేనిజనులు ప్రపంచములోనే లేరనియు నటులేవరైనను ఉండినచో వారు కేవల పశుప్రాయులగు నడవిజనులగుదురనియు, చరితలేమి పథికులగాథలేమి తెలుపుచున్నవి. మానవులకుఁ దెలిసినంత మట్టుకు నెచ్చోటనెక్కాలమునఁగాని మతములేనిజాతి యుండినటులగపడదు. ప్రారంభమున నాచే నుడువంబడినరీతిగ మతతత్త్వమనేకాకృతులు గొనిజనులలో వ్యాపించి స్థళవిశేషముల కొలదివన్నెలుఁ జాల్చిమనుజుల చిత్తచాంచల్యము కొలఁదిని భూమికలుధరించి ప్రపంచనాటకశాలలందు నటించుచుండును. తత్త్వమొకటియైనను రూపభేదములనేకములయి యగపడు కారణంబున ప్రకృతిసాంబంధిక మాయజనుల జ్ఞానమునుఁగప్పి తత్త్వమును మఱుఁగుఁబఱచి వెలిరూపములే నిజములని భ్రమఁజెందులాగొనర్చినది. తెలివిగలమనుజుఁడు పెట్టుచాయను దొలఁచి పుట్టుచాయను గుర్తెఱిఁగినేని సర్వవ్యాపకమగు మతతత్త్వమును దెలిసినవాఁడగును. దాని దెలియక జనులనేకులు పైచాయలే దైవనిర్మితములగు మతములనినమ్మి దానిని సాధింపఁ గ్రూరకృత్యంబులనేకములొనర్చుచుఁ బలువిధములగు ననర్థములకుఁ గారణభూతులైరి. మతవిషయమున సత్యమగుతత్త్వమొకటి నిజముగనున్నదియా? కాదేని మానవమానసగోచరమయ్యిన యెద్దియో యొక విషయము దైవసాంబంధికమనితలంచి యావిషయనిజస్థితినిఁ దెలియ సార్వకాలమాలోచించుచు నిరర్థకులయి వివప నావిషయమునుగుఱించి యనేకప్రశ్నలు వేయుచు నిరుత్తరులయి దేవులాడుచున్న వారాయనునది విచారణీయముగ నున్నది. ఈవిచారము సర్వఁకష ప్రజ్ఞగల పెద్దలుసేయఁదగినది కావున నేనిచట దానిజోలికిఁబోవ నిష్టపడను. అయినను నీవిషయమున నొక చిన్నికథ నాజ్ఞప్తికివచ్చినది. ఏబ్రహ్మంబాల్యమున నొకదినమునఁ బ్రాతఃకాలమునుండి సాయంత్రివరకును సూర్యప్రకాశమునుఁజూచి సూర్యుఁడే దైవమని నమ్మెనఁట. సూర్యుఁడస్తమించి చంద్రోదయమయి చల్లనివెన్నెల ప్రపంచమెల్ల వ్యాపించినది చూచి చంద్రుఁడే దైవమని తలఁచెనఁట. కొంతకాలమునకుఁ జంద్రుఁడుమునింగి యంధకారంబు దశదిశల

వ్యాపించెనట. అపుడా బాలుఁడు తాను ప్రారంభమునఁ దలఁచినవారు దైవములు కారనియు వీరినిమించిన దైవమొక్కఁడుండవలెననియుఁ దలంచి వానిఁ దెలియుటకు యత్నింపసాఁగెనట. అటులనే కార్యములు జూచి కారణము లూహించునట్టిదియే యీమతవిషయము! కాదేని నిజముగ మతతత్త్వమొకటియున్నదియా యనునది సైతము విచారణీయము. ఒక్కస్థలమునందుఁగాని యొక్కజాతియందుఁగాని యొక మనుజునందుఁగాని నెలకొనక, సర్వప్రపంచమందును, సర్వజాతులందును సర్వజనులందును, నీమతతత్త్వము వ్యాపించియుండు కారణంబున నిదినిజమగు తత్త్వమని నమ్మెదము. అటునమ్మి ముందువిషయ మాలోచింతము. కాదని యెవ రైనను స్థాపించిన యెడల వదలుదము.

మానవునియితర తలంపులబలెనే, మతవిషయక మగుతలంపు సైతము వానిబాహ్యచర్యలు వలనమన మెఱుఁగనగును. బాహ్యచర్యలను బట్టితప్ప మానస చర్యలు మనముతెలియఁజాలము. బాహ్యచర్యలు పలువిధములుగ నుండినను సామాన్యతత్త్వమొకటియుండి దానివలన నీభిన్నాకృతులు పుట్టెనని చక్కని విమర్శనము వలన మనము తెలియనగును. ఆసామాన్యతత్త్వమెద్దియన, మానవుఁడు తనకు దైవబాంధవ్యమున్నదని నమ్మియా దైవముతో హెచ్చుసంబంధముఁగలిగించు కొనునపేక్ష. ఇట్టియపేక్ష మనుజునకు లేనిచో మతమను తలంపే మానవునం దుండదు. ఉండినను వెలికిరాదు. ఈతలంపు ప్రతిమనుజుని మానసమునందు నైజ ముగనుద్భవించుచుండును. ప్రపంచంబునుజూచియు, నందుండు పర్వతములు సముద్రములు, నదులు, అరణ్యము చెట్లు, సూర్యచంద్రనక్షత్రములు, వారిరాక పోకలు, ఋతుసాంబంధికవర్షములు మొదలగు ప్రకృతి చిత్రములనుజూచి వానిఁ గలిగించు వాఁడొకఁడుండునని యెవని హృదయమునందు గోచరింపకయుండును? అట్టిమహనీయుని నారాధించుటవలనను, వేఁడుటవల్లను, తలఁచుటవల్లను, కీర్తనలు పాడుటవల్లను, వానితోసంబంధము గలుపుకొను నపేక్షయే మతము. ఇట్టియపేక్ష మనుజునకుఁగలిగినతోడనె దానిని సాధింపఁదగిన మధ్యవర్తులు, గావలసివచ్చునుగదా! తమప్రార్థనలు దైవములకుఁ జేర్చి, దైవముల యాజ్ఞలుగొని తెచ్చుటకు మనుజులు తమలో పెద్దలును జ్ఞానులును నగువారిని మధ్యవర్తులుగ నేర్పఱచుకొనుట సహజము గదా? మనుజులనడవడికల గుఱించి పలుకుచు వారిదుష్కృత్యములకు శిక్షయు, సుకృతములకుఫలమును నిచ్చినటులపలికిన మధ్యవర్తులవచనములను సంపూర్ణముగ నమ్ముట పురాతనమానవులకు సహజముగనుండెను. ఆదైవమును సమీపించుమార్గ ములు తెలుపుగాథలు పవిత్రకరములని చెల్లకాలము పఠింపసాగిరి. దైవము జనుల

నడవడికలను గురించి వ్రాసినాడనునట్టియు దైవసమ్మతిని జ్ఞానులు వ్రాసిరనునట్టియును దైవమే జ్ఞానులచే వ్రాయించెననునట్టియు గ్రంథములు దైవముంబలెఁ బూజ్యములయ్యెను. అందులోని ప్రతి యొక్క శబ్దమును జనులు శిరసావహింపవలెననియును, వానియందే మార్పయినను జేయఁగూడదనియును నందులకు విరుద్ధముగ నెవరు నెప్పుడును పలుకరాదనియును నిర్ధారింపఁబడెను.

పురాతనమనుజులకు దైవములతో సంబంధము గలిపికొనవలెనని సంపూర్ణముగ నపేక్షకలిగియుండిన కారణంబునఁ దమ ప్రార్థనలు దైవముల సరసకుఁ గొనిపోవుటకును దైవముల యాజ్ఞలు మనుజులకుఁ దెచ్చుటకును సాధనములుగ మధ్యవర్తుల తరగతి యొకటియేర్పడెను. పిదప దైవానుగ్రహమును సంపాదింప ననేకవిధములగు మార్గములు వెదకికొనిరి. అందునఁగొన్నియిచట వ్రాసి పిదప నొకమతమార్గమెన్ని మతములందు సామాన్యముగనున్నదియో తెలిపెద.

మనుజులకును దైవములకును సంబంధములుగలుపు మార్గములు రెండు భూలోకమునుండి స్వర్గమునకు, జనుల ప్రార్థనలు గొనిపోవు మార్గము మొదటిది. స్వర్గమునుండి దైవముల యాజ్ఞలు జనులకు దెలుపు మార్గము రెండవది. ప్రారంభమున మొదటిమార్గ మెన్నివిధములుండునదియు యేయే మతస్థు లేమార్గము నెటులవలంబించినారనియు నీక్రింద వివరించెదను.

[1] దైవమునుగురించి కొన్నికల్పితకాలములం దుత్సవాదులొనర్చుట. ఇవి "పవిత్రకాలము" లని నేఁ బేరిడెద. ప్రార్థనలు, స్తుతులు, బలులు, ఉత్సవములు, ఆగమములు, ఆరాధనలీ తరగతిలోఁ జేరును.

[2] ఒకటవతరగతికిఁ జేరిన యాగమారాధనాది కర్మములొనర్చ స్థలవిశేషంబులు నిర్ధరించుట. వీనికిఁ "పవిత్రస్థలములని." పేరిడెద.

[3] మతకార్యములకుఁగాను వస్తువు లనేకము లియ్యఁబడును. పటములు, విగ్రహములు, వస్త్రములు, ఆభరణములు, ఆరాధనలకుఁగా నియ్యఁబడిన భూములు, పాత్రలు. ఇవి యీ తరగతిక్రింద వచ్చును. వీనిని "పవిత్రవస్తువులని" పేరిడెద.

[4] కొందఱు దైవములతో సామీప్యసంబంధము గలిగించికొనవలెననెడి నత్యాశతో నాహార విహారములువదలి సార్వకాలము దైవస్మరణలో నుందురు. సన్యాసులు యతులు మొదలగువారు. "పవిత్రమానవులని" వీరికిఁ బేరిడెద.

[5] కొందఱు జనులు స్వప్రయోజనకుఁగాక లోకహితార్థంబునకునై లోక

మునకే దైవసంబంధము గలిగింపవలెనని యుద్యమించువారు. ఇట్టివారిని మహాత్ములని పేరిడెద.

ఇఁక దైవముల యాజ్ఞలు భూజనులకుఁ దెచ్చు మార్గములు గొన్ని యున్నవి. వానినిఁక్రింద నుదాహరించి పిదప నేయేమతములందీ యాచారములు సామాన్యముగ నున్నవియను విషయము సూక్ష్మముగఁ జర్చించెద.

[ఎ] దైవములు తమయాజ్ఞలను కార్యముఖమునఁ దెలియఁజేయుచుండును. అవి శకునములు, ఆవేశవచనములు "మహిమలు" కలలు ఇత్యాది కార్యములద్వారా తెలియపఱతురు కావున నివి "పవిత్రవార్తలని" పిలువఁబడును.

[బి] కొన్నిస్థలములు దైవచోదిత వచనములు వినుటకునై యేర్పడినవి. వానికిఁ "బవిత్రస్థలము"లని పేరిడెద.

[సి] దైవమహిమలు గలిగినవిగఁ గొన్ని మూలికలును వస్తువులు నేర్పడినవి. రోగనివారకములుగను భూతోచ్చాటనలకును వానినుపయోగింతురు. ఆరాధించుచుందురు. వీనికిఁ "పవిత్రమూలికలని" పేరిడెద.

[డి] సమస్తజాతివారును దైవముల యాజ్ఞలను తమకుఁదెలుపుటకును నా యాజ్ఞలెట్లు లొనరింపఁదగినదియుఁ దెలుపుటకును జ్ఞానులగువారినిఁ గొందఱిని నేర్పఱచికొందురు. అట్టివారికిఁ "బురోహితులని" పేరిడెద.

[ఇ] కొందఱు తాము దైవములకుఁ బ్రియులనియు దైవములు తాము తలఁచినపుడు తమయందావేశించి కాఁదగిన కార్యములకు మార్గములు చూపుచుందురనియుఁ దెలుపుచుఁ బూజ్యులయినారు. వీరు "దైవముచెప్పువారని" పిలువఁబడుదురు. [Prophets]

[యఫ్] మతాచారములు చక్కఁగ జనులు నెరవేర్చుటఁ గనుటకునై దైవము తమకు నధికారమిచ్చినాఁడనువారు కొందఱేర్పడినారు. వీరికి "స్వాము"లని పేరిడెద.

[జి] మనుజులు జాబులు వ్రాసి దైవములకుఁ జేర్ప నశక్తులైనను దైవములు జనుల విషయమునఁ గొన్నినిబంధన లొనరించి వానిని వ్రాసి భూలోకజనులకు నిచ్చినవని గొన్నిగ్రంథము లేర్పడినవి. వీనికిఁ "బవిత్రగ్రంథము"లని పేరిడెద.

సభ్యులారా! మతప్రవాహములోఁ గొన్ని శాఖలివి. వీని నొక్కొకటిగ విడదీసి యావిషయము వేర్వేఱుగ వ్రాయఁబూనెద. విపరముగ వ్రాయుదునేని గ్రంథబాహుళ్యమగును. కావున నేను స్థాలీపులాకన్యాయముగ వ్రాసినది చదువరులు విస్తరించుకొందురని నమ్మినాను.

హృదయాంతర్గతమగు మతతత్త్వమును వెలివేయు బాహ్యాచర్యల క్రమము.

(1). పవిత్ర కార్యములు.

మానవప్రారంభ బాహ్యాచర్య సామాన్యముగఁ బూజావిధానమున వెలివడుచున్నది. దైవమునుస్తుతింప వలెననుతలంపు మానవుని మానసమునందు హఠాత్తుగఁ దనంతకుఁ దానేపుట్టును. స్తుతులరూపము స్తుతివిధానము, స్తుతించు స్థళము, పలురీతులుగ నుండును. ప్రథమమున మానవుఁడు తనశక్తికంటెను భిన్నమయినట్టియు యత్యధికమయినట్టియు మఱియొక శక్తికలదని భావించెను. అటుభావించినపిదప నట్టి యమానుషమైనదైవశక్తిని స్తుతులచేతను పూజావిధానములచేతను సమీపింపవచ్చునని నమ్మెను. అటునమ్మి తానొనరించు స్తుత్యాదులు రిత్తపోవనియు దానికి దైవము ప్రతిఫలమిచ్చుననియు నిర్ధరించెను. అతిపురాతనకాలమునందున్న మానవుఁడు, మర్త్యునకు దృగ్గోచరముగాని యొకశక్తికిఁదనయునికిలోఁ బడినదనియు, యాశక్తి చర్యసంపూర్ణముగఁ దానుగనఁ జాలడనియుఁ దలఁచెను. ఆదైవశక్తిక్రమము, మానవులు తమతమ యోగ్యతానుసార మూహింపసాగిరి. ఏవిధమయినబుద్ధియు లేనట్టిమోటుజనులు తమయెదుటనగపడు ఱాళ్లు అప్పలు, శల్యములు, తోళ్లు, వెంట్రుకలు వీనియందుదైవమహిమయున్నదనియూహించి వానినారాధించుచుండిరి. ఇంచుకతెలివిగలవారు ప్రకృతిచిత్రమహిమలకునబ్బురమంది, గొప్పపర్వతములును, నదులును, వృక్షములును, దైవమహిములుగ భావించిపూజించిరి. అంతకంటెను హెచ్చుగబుద్ధిగలవారు తమకంటికిఁగనపడినను, బట్టనలవిగానట్టియు, స్పర్శనీయములుగానట్టియు వస్తువులేదైవశక్తులని గౌరవించి యారాధింపసాగిరి. సూర్యచంద్రాది గ్రహములు, నక్షత్రములు, మరుత్తులు, మేఘములు మొదలగునవి యీతరగతిక్రిందవచ్చి, పూజింపఁబడసాగెను. పైనపలుకఁబడిన దైవమహిమలు కొంతకాలమునకు మహచ్ఛక్తిగల మనుజులుగ భావింపఁబడి పూజ్యతనందెను. మఱియును గొంతకాలమునకుఁ బైశక్తులకంటెను మించినదైవశక్తి యదృశ్యముగ నెచటనో యుండుననియు, పైనవివరించిన శక్తులాశక్తియొక్క యాజ్ఞలు నిర్వహించు వారనియు జ్ఞానులు కొంద ఱూహింపసాగిరి. ఈరీతిగమానవులచే నూహింపఁబడినశక్తులు మానవమానసములందవిచ్ఛిన్నముగ జంటింపఁబడిమత రాజ్యమునేలుచుండును. ఇదేవిధముననే పితృదేవతలపూజలు సైతము మానవుల యూహాజనిత ఫలములు. మంచిశక్తులబలెనే చెడ్డశక్తులు సైతము పూజ్యతఁగాం

చెను. భక్తిచేఁ బ్రారంభశక్తులు పూజింపఁబడుచున్నవి. భయముచేఁ జెడుశక్తులు లారాధింపఁబడుచున్నవి.

పురాతనకాలమునుండియు నారాధనలుసలుపుటయు వానివిధానములనుఁ జక్కఁగ గమనించినచోఁ బ్రాచీనజనులు తమయారాధనలు దైవసమ్మతములనియు దైవములాయారాధనలను స్వీకరింతురనియు సంపూర్ణముగనమ్మిరని తెలియనగును. ఆరీతిగ దైవములుతమస్తుతులు వినితమకు మేలొనరింపరనితలఁచి యుండినచో నిట్టియారాధనలేజగత్తునఁ బుట్టియుండవు. అట్టిస్తుతులలోని శబ్దములు, వానియక్షరములు, వానియుచ్చారణ క్రమములు, స్థళములు దైవముల మానసామోదములుగ నుండవలెననియు, వీనులకు విందులుగనుండవలెననియు వాడరాఁదగినవి యస్థానములుగనుండవలెననియు పురాతనమానవుల యభిప్రాయము. పైరీతిగస్తుతుల చేనారాధించునపుడా స్తుతులలోఁ దమవినయవిధేయతను జూపునట్టివాక్యజాలములును, దైవములయున్నతియును, మహాశక్తియును జాటుస్తోత్రపాఠములు నుండఁదగునని వారిసంపూర్ణాపేక్ష. ఈపాఠములు, స్తుతులుప్రార్థనలని రెండువిధములుగఁ బరిణమించెను. స్తుతులన దైవములయొక్కయున్నత స్థితియును, మహాశక్తియుఁ దెలుపునవి. ప్రార్థనలనంస్తుతులొనరించుచుఁదమకుఁ గావలసినయర్థంబులిమ్మని దైవమును గోరునవి. స్తుతులన్నియును బ్రార్థనలుగఁబరిణమించెను కావునయా రెంటికిని భేదమగపడకపోయెను. కేవలస్తుతులరూపకముగఁ గొన్నిపూర్వవాక్కులున్నవి. అవియత్యల్పము. అనేకమతమువారు పూర్వకాలంబున నుపయోగించిన ప్రార్థనలలోఁ గొన్నియిచటవ్రాసెద.

యుద్ధసమయమున నూట్కాయనుజాతివారీరీతిఁ బ్రార్థించెదరఁట.

" దైవమా! నన్నుమననిమ్ము. అశక్తునిఁజేయకుము. నా శాత్రవులను నాకుఁజూపుము. వారికివెఱవనటులఁ జేయుము. నేఁగాంచినపుడు వారునిద్రింపనిమ్ము. వారినసేవలను నేఁజంపనిమ్ము".

హురాన్ జాతివారు వ్యాపారమునకుఁ బోవునపుడీరీతిఁబ్రార్థింతురఁట.

" ఈ స్థళమునందుండు " ఓకి " దైవమా! నీకుఁదగినంత పొగాకు నిచ్చెదను. మాకుఁదోడ్పడుము. నావలనుండిమముఁగాపాడుము. శాత్రవులనుండి మమురక్షింపుము. మంచివ్యాపారము దొరకనిమ్ము. భద్రముగమేము తిరిగిమా గ్రామముఁజేరనిమ్ము. కాఫర్లుతమదైవముల నీరీతిగఁబార్థించెదరు.

" దైవములారా! నన్నురక్షింపుడి. నాపిల్లలనురక్షింపుడి, నాభార్యలను రక్షింపుడి. నాజనులనురక్షింపుడి. నాపిల్లరోగమునివారించి రక్షింపుము. బిడ్డలననేకులనిమ్ము

పుత్రసంపద చాలుగ నుండనిమ్ము. పుత్రికాసంపద స్వల్పముగనుండనిమ్ము. ఆహార సంపదనిమ్ము. పశుసంపదనిమ్ము.

సామర్ జాతివారు సాయంకాలహూమాయను రసముద్రావునపుడు తమ దైవమును గుఱించి యీరీతిఁబలుకుచున్నారు.

" దైవములారా! మీకునై " ఆవా " యనురసమును సిద్ధపఱచినాము. అనుగ్రహించి మాకుటుంబమును జూడుము. ఈకుటుంబమునకు సౌభాగ్యమిచ్చి వృద్ధిఁ బొందింపుము. మాకునారోగ్యమునిమ్ము. మా వృక్షములు ఫలములందనిమ్ము. నీజనులకుమాకునాహారమునిమ్ము. ఇదిగోఆవానుగొమ్ము."

పురాతనార్యులు విశేషనాగరికతఁ గలవారయినను వారివేదబుక్కులందు సైతము పైమోటుజనులబలెనే ప్రార్థనలున్నవి. M. 1. 64 లో " మరుత్తులారా! మాకుబలమిండు. యశమిండు. యుద్ధములోజయమిండు ధనమిండు etc. అనియున్నవి.

జెండవస్థలో సైతమిదేరీతిగఁ బ్రార్థనలు గొన్నియున్నవి. హీబ్రూల ప్రార్థనల క్రమముఁజూప సాలొమన్ ప్రార్థననీక్రిందవ్రాసినాను.

" జిహోవా! క్షామమునివారింపుము. ఈతిబాధలనుండి రక్షింపుము మంచివర్షమునిమ్ము etc. "

లిటర్జీలని పిలువంబడు క్రిస్టియన్లప్రార్థనలు సైతమిదేవిధముగనున్నవి.

వర్షమును గోరుచుఁబ్రార్థించు ప్రార్థనలు ప్రపంచమున సర్వమతములందున్నవి. భూలోకమునఁ బాపముహెచ్చయినపుడు వానలు కురియవనుతలంపెల్లప్రపంచము వ్యాపించెననితోఁచెడు. కావునవర్షమును గుఱించిన ప్రార్థనలేమతమునందునను హెచ్చినవి. (ఇప్పటికాలమువారు సైతమీతలంపు వదలకయున్నవారు. వానలులేకక్షామము బలమయినపుడు ప్రార్థనలు నభిషేకములు బలమగుచున్నవి. ఈ విషయమున మతమనుపాశము మానసమును బంధించినది. యుద్ధమునందు జయమును గోరుచు పురాతనజనులు ప్రార్థించిరననేల యిక్కాలమున సైతము నాగరికతలో నసమానులనిప్రసిద్ధిఁగాంచిన యాంగ్లేయులు సైతము తమ దేవాలయములలోనీ విషయమునుగుఱించి ప్రార్థించుచుందురు.

కొన్ని మతముల ప్రార్థనలలో నిచ్చిపుచ్చుకొను వ్యాపారలక్షణములు కొన్నియున్నవి. పూజించువాఁడు దైవమునకుఁగాను పనిచేసిన కారణంబునఁ బ్రతిఫలమిమ్మని కోరుచుండును. అటులియ్యనిచోఁ దనపనిని వదలుకొని యెవనిని వల

కును. స్తుతిపాఠములకు బహుమానము ప్రతిఫలమొసంగుట. ఋగ్వేదమున మరు త్తులను బొగడుచు నార్యులు తమకుఁ బుత్రసంపదనిమ్మనియును నాహారమిమ్మని యును, జలవసతిఁగల స్థళము తమకుఁ జూపుమనియు వేఁడినారు. హీబ్రూలున్ను క్రిష్టియనులు నిదేరీతిగఁ దమదైవములను హెచ్చుగఁబొగడి ప్రార్థించినారు. ముఖ స్తుతి హెచ్చుగ నొనర్చినయెడల తమదైవములు తమ్మనుగ్రహింతురని సర్వమత ములవారును నమ్మినారు. హెచ్చునాగరికతఁగలగ్రీకుమతస్థులలోనత్యతిశయ పండితుఁ డనిసుప్రసిద్ధికెక్కిన "యస్కైలాస్" యనుకవి. "Theswam a;ainst Thebes" యనునాటకములో "జీయస్స" యను దైవమును బ్రార్థించుచు నీరీతిగఁ బలికి నాడు. "దైవములారా! మనయుభయుల మేలుకుఁగాను" "టీబిస్సు" పట్టణ మును గాపాడుము. పట్టణము వృద్ధిఁజెందెనేని దైవములకు గౌరవము కలుగును. ఇట్టి పట్టణము పోయెనేని దైవములారా! మీరు నివసింప మఱియొకపట్టణ మిట్టిది మీకునెచట దొరకును?" అని ప్రార్థించెను. జేకబ్బు జిహోవానుగుఱించి యీ రీతిగఁ బలికెను. "దైవమా! నాసరసనుండి నామార్గముకంటక రహితముగనొనర్చి తినదన్నమును గట్టనుబట్టలునిచ్చి మరల నేను నాగృహమును జేరితినేని నపుడు గదా నీవు నా దైవమగుదువు. నాచే స్థాపింపఁబడిన యీశిల దేవాలయమగును. నీవు నాకునిడినదానిలోఁ బదియవభాగము మరలనీకిడుదును" జిహోవా దైవ మగుట జేకబ్బు కోరిక నెరవేఱుట. అటుకాదేని జిహోవా దైవముకాడని యర్థ మగును. వేదబుక్కులో నార్యులప్రార్థన యొక చమత్కారముగఁ బలుకఁబడినది. "పృస్నిపుత్రులారా! మీరుమర్త్యులయి నేనమర్త్యుఁడనై యుంటినేని నన్నారాధించు వారు వ్యర్థులగుచుండలేదు. ప్రాణములుఁ దొలఁగుచుండలేదు. మఱియొక బుక్కు లో నీవిధముగఁ బలుకఁబడినది "ఓ, యింద్రా! నేనింద్రుఁడయి యుంటినేని నన్ను నుతించువాఁడు పశువులు లేనివాఁడుగ నుంటుండలేదు."

సర్వమతములందును నిట్టిప్రార్థనలున్నవి. కావున దీనినుండి మన మూహింపఁదగినదియే మన బహు పురాతనకాలమున మానవుఁడు తనకు దృగ్గోచ రముగాని మహచ్ఛక్తి యొకటియున్నదని సంపూర్ణముగనమ్మి భూలోకమున మహా రాజులనాశ్రయించి పొగడుచుండినచోఁ దమకు ఫలప్రాప్తి యెటులగునో యావిధ ముగనే తాము మానసమునందెన్నిన మహత్స్తక్తియును దమపొగడికవిని తమకోరి కలు నెరవేర్చునని నిస్సందేహముగను నిష్కల్మష హృదయమున నమ్మినవారు. ఆదేయభిప్రాయమే తరతరములుగ వచ్చుచు వారివారి బుద్ధివిశేషముల కొలదిని బెఱుగుచు విఱుగుచు మరల మొలకవేయుచు శాశ్వతముగనిలిచినది, ఆ మానవుల

పొగడికలువిని ఫలములిచ్చు శక్తియొకటి యదృశ్యముగ నున్నదియను గొప్పవిషయము పెద్దలు నిర్ధరింపఁదగినది. ఆజోలి నాకేల? ప్రపంచమునందుండు జాతులలో నెల్ల నీస్తుతు లనేకరూపములుగొనియుండు కారణంబు మతతత్త్వరూపములలో స్తుతిరూపకమైనది ముఖ్యమని వ్రాసితిని.

మతమును వెలివేయు రెండవ బాహ్యాచర్య.

బ లి స మ ర్ప ణ ము.

స్తుతులకుఁగలిగిన పురాతన ప్రాముఖ్యము బలిసమర్పణములకు లేకయున్నను నిది ప్రాచీనమానవుఁడతి ప్రాచీనకాలముననే ప్రపంచమునం దుద్భవింపఁజేసినది. స్తుతులున్న మతములలో నెల్ల బలులున్నవి. ఈ రెంటికిని భేదమేమనిన స్తుతు లొకానొక సమయమున మానవుని మానసమందు హఠాత్తుగ నుద్భవించి వెలిపడునవి. బలులన్ననో, దీర్ఘాలోచనపైన బల్యర్పణవిధులును బల్యర్హమగువస్తువులును నేర్పఱుపఁబడిన విషయములు గలిగినవి కావున బల్యర్పణవిధియొక యధికారబలమునకు లోఁబడినది. కావుననే కొన్ని బల్యర్పణ విధులందుఁ బురోహితుల సాన్నిధ్య మవశ్యకమయ్యెను. బల్యర్పణవిధులు పుట్టుటకుఁ గారణము లీక్రింద వివరించినరీతిగ నూహింపనగును. తాఁదలఁచిన దైవములకుఁ దగిన బహుమానములిచ్చినచో దైవము తన్ననుగ్రహించి సౌభాగ్యసంపద లొసంగుననెడి యపేక్ష. స్తుతులు నోటిమాటలు. దైవమునందు సేవకునకుఁగల యత్యంతాసక్తినిఁ గార్యమూలకముగఁ దెలుపవు. ఐహిక సంపదనంతయును యజమానుఁడు స్వప్రయోజనమునకుమాత్ర ముంచుకొనినయెడల, వానిపైన దైవములకు నాగ్రహముగలిగి చెడుగొనరింతురేమోయను భీతిప్రాచీన మనుజునకుఁ గలిగియుండును. ఇదియును గాక దైవములు తన్ననుగ్రహించి సకలసౌభాగ్యము లిచ్చినందులకుఁ గృతజ్ఞుఁడయి మానవుఁడు వారి సంతోషమునకయి కొంతభాగము బలులరూపముగ నర్పింపవలెననెడి యుత్సాహంబుద్ధివలననైనఁ గలిగియుండును. యజమానుని భక్తియు, నాచారశీలతయు, రాఁబోవు లాభమనెడి యాశయును, బలిభాగరులగు పురోహితులచేఁ బెంపఁబడెను. అదృష్టవశమున యజమానునకు ధనధాన్య సంపదలు హెచ్చెనేని దైవములకు బల్యర్పణ ఫలమదియని యెన్నిరి. ఎద్దియయినను జెడుగుమూడెనేని బల్యర్పణములు సేయమిమో, చేయుటలో లోపమోయని యెన్నిరిగాని దైవములు వీనిని స్వీకరించు నభిలాష కలవారగునో కాదోయను నంశమును విచారింపఁబూనరైరి. ఈరీతిగ నీ బల్యర్పణ విధానము వృద్ధినందెను. ఒకరిని

మఱియొకరు వానికంటెను హెచ్చుకావలెనను మత్సరబుద్ధిచే నీ యాగమువిధులును యాగమబలులును యాగమకాలము యాగమదక్షిణలును హెచ్చఁజేసిరి. ప్రారంభమున మనుజుని యిష్టానుసారమయి యొనర్పఁబడుచుండిన బల్యర్పణములు గొంతకాలమునకు వదలరాని విధులయ్యెను. అవి యొక బలవద్బాధకమగు శాస్త్రమయ్యెను. జనుల సంతోషముకొఱకు రాజులకుఁ బ్రారంభము నిడుచుండిన బహుమానములు కొంతకాలమునకు విధింపఁబడిన పన్నులయినట్టుల నీ బల్యర్పణములు విధులయి పరిణమించెను బల్యర్పణవస్తువు లనేకరూపములు గొనినవి. మనుజు లేవస్తువుల నమూల్యములని తలఁచుచుండిరో యవి బల్యర్హములగు పదార్థములయ్యెను. భక్ష్య భోజ్యములు, మాంసము, పిండివంటలు, పాలు, పెరుఁగు, నెయ్యి, యీ మొదలయిన వస్తువులు బలులకుఁ బ్రియములయ్యెను. ఆటవిజనులు కొందఱు తమకనుపయోగకరములుగాని వస్తువులు శక్తులకు బలులిచ్చుచుండిరి. అవి శక్తులకుఁ బ్రియములుకావయ్యెను గావున వారభివృద్ధిఁ జెందలేదను గాథలు వాడుకలో వచ్చెను. వెలలేని బల్యర్పణమనునది మానవవధ. ఈ మానవబలి నాగరికతలేని మూఢజనులందుద్భవించెను. పిదపఁ బ్రపంచమునఁ బలుచోట్ల వ్యాపించెను. దక్షిణసముద్ర ద్వీపములందు మానవబలులతి ఘోరముగనుండెను. నీగ్రోలయందుసైతమివి హెచ్చుగనుండెను. మెక్సికనులు నాగరికతఁగల వారుగనుండినను మానవబలులిచ్చుచుండిరి. అయితే వారు తాము జయించి పట్టితెచ్చిన శత్రువులను బలియిచ్చుచుండిరి. ఉత్సవముల కాలమున బలియివ్వఁ దగిన మనుజుని నొక సంవత్సరము దైవముగఁబూజించుచు, సకలాహారము లిచ్చి సకలభోగములఁ బెంచి, యుత్సవదినంబున శక్తికిబలి యిచ్చుచుండిరి. ఇటులనే బహుదేశములందును బహుమతములందు నీమానవబలులు హెచ్చియుండెను. ఇప్పటికిఁ గొన్ని స్థళములందు మూఢజనులీమానవ బలులనిచ్చుచున్నారు. అయితే యిది యతిరహస్యముగజరుగును. ఈమానవబల్యర్పణముతోనే పశుబలులు రూఢిలోవచ్చెను. వెలలేనివస్తువు మనుజునిప్రాణము. దానికిరెండవది పశుప్రాణము. కాఫర్లుబలులెప్పుడును పశువులు మేకలు, మందలోవెలగల గొప్పయెద్దును బలికిగాను నిర్ధరించియుంచుచుండిరి. దానికిశక్తిపశువనిపేరు. ఆఫ్రికాలోఁబశ్చిమ తీరమందుండు "సూసూస" ను మతమువారు తామేముఖ్యమగుకార్యమును నేయఁదలపెట్టినను వృషభబలియివ్వకఁ జేయుచుండలేదు. వ్యవసాయకాలమునందు గొఱ్ఱెనైనను మేకనైనను బలియివ్వకవారు భూమిని దున్నుచుండలేదు. క్రిమియ

ద్వీపములవారు, "ఎద్దు, ఆవు, గొఱ్ఱె, మేక, కోడి, సారాయి, పండ్లు" యీవస్తువులలో నెవ్వియయినను బలులివ్వక యే కార్యము నెరవేర్చుచుండలేదు. అమెరికాలో నుండునిండియనులు పొగాకు, జొన్నలు etc. బలులిచ్చుటయగాక మంచికుక్కలను బలులిచ్చుచుండిరి. ఆయిండియనులకుఁగుక్కలపైఁ బ్రీతిమెండు కావుననే కుక్కలను బలులిచ్చుచుండిరి. చైనావారు ఎద్దులు, దూడలు, గొఱ్ఱెలు, పందులు మొదలగు వానికొంతకాలమువఱకుఁ గడిగి పావనమొనర్చిసిదప బలులిచ్చుచుండిరి. జ్యూజాతివారు పందులఁదప్ప మిగతమాంసములు బలులుగనిచ్చుచుండిరి. మిగతపశువులే రోగములేకనారోగ్యస్థితిలోనుండి బలిసియుండవలెనని వారిచట్టము. అనేకదేశస్థులన్నము బలిగనిచ్చుచుందురు. పండ్లలో మొదటిపంట దైవములకుగాను వదలుచుందురు. కొన్ని దేశస్థులు తామాహారముగఁగొను పదార్థములలో గొంతభాగము దైవమునకు బలిగఁదీసిపెట్టుదురు. తమపానములోఁ గొంతభాగము దైవమునకు బలియనిక్రింపఁజల్లుచుందురు. ఒక్కొక దేశము వారొక్కొకవిధముగ బలులిచ్చుచుందురు. పార్శీవారు రొట్టెయు హోమరసమును బలులుగనిత్తురు. బలులిచ్చువారు దైవయోగ్యములవియని యెవ్వితాముదలంతురో యవియెంతవెలగలవస్తువులైనను వెనుదీయక దైవములకు నిడవలెనని యుద్దేశ్యము. జ్యూలొకానొక సమయమున జహోవాకు మంచియెద్దునివ్వక బక్కపలచని యావునిచ్చుచుండగ దైవమునకుఁ గోపము వచ్చిదానిని నిరాకరించినవానింబలెనటించెనఁట. చెడినయాహారమునుగాని పానీయమునుగాని బలులుగనివ్వఁగూడదని బౌద్ధులుపలికిరి. సర్వమతస్థు లిదేరీతిగఁ బలుకుచున్నవారు. రాజాధిరాజులకు నెట్టియమూల్య పదార్థములు బహుమానములుగనివ్వఁబడునో యంతకంటెను హెచ్చగునవి దైవములకు బలులుగ నివ్వవలెననిజలను యభిప్రాయము. అట్టివియే దైవముల కోరికగనుండవలెనని వారెన్నియుండిరి. దైవమహిమయందుఁగల నమ్మకమునకుఁ జేరికగమతమునందలి హెచ్చుపట్టుదలయును సమానులలో నుత్తమశ్లోకుఁడుగావలెనను నభిలాషయునుఁగూడి ప్రేరేపింపఁగొందలు తమసర్వస్వము దైవ ప్రీతిగబలులిచ్చి సన్న్యాసులైరి. ఇట్టిసమర్పణములలోఁ బురోహితులు భూరిభాగరులుగనుండుదురు కావునను, పురోహితులు మోక్షమార్గదర్శకులని జనులుసంపూర్ణముగ నమ్మియుండిరి. కావుననే బల్యర్పణములు దినదినాభివృద్ధిఁగాంచెను. బలిసమర్పణమనునది కొన్ని సమయములలో "దేవునకుఁజూపులుమాకుమేపు" లనునిదర్శనమునకుఁ గుఱిగనుండును. సమస్తమతములందును బలిగనివ్వఁబడిన పశ్వాద్యాహారములు పురోహితులకును మానవులకు నాహారముగనుండును "Christian Sacrament" యిట్టిదియ. ఆర్యులయొక్కగుఱు నైరాశ్య

యొక్కయు బలులీ సంబంధములేను. ఆర్యులనైనంగిన దేవనై వేద్యమిట్టిదియ. మెక్సి
కనులు పిండియును దేనెయును గలిపి నైవమును జేసి పూజించి దాని నెల్లరు భుజించు
చుందురు. పార్శిలలో నేమి జ్యూజాతివారియందేమి యాస్యులయందేమి మఱికొన్ని
మతస్థుల యందేమి శక్తి బలులుగ నర్పింపఁబడిన వస్తువులలోఁ గొన్నిభాగములు
పురోహితులవని విధులేర్పడినవి. ఆ భాగములు మఱియెవ్వరు నంటఁగూడదని విధి.
ఐహికపారలౌకికసుఖములకేగాక పాపవిమోచనార్థంబుసైత మీబల్యర్పణమేర్పడినటు
లగపడుచున్నది. బలులిచ్చినపుడు దైవమువచ్చి యారగించెనని హీబ్రూల మతగ్రం
థములో గాథయున్నది. ప్రపంచంబునందెల్ల నీ బల్యర్పణములు నున్నవిగాని క్రిశ్చి
యనులలో నంతగలేవని కొందఱాడుదురు నిజము. అయితే క్రిశ్చియనుల దైవమగు
క్రీస్తు జనుల పాపవిమోచనమునకై దైవప్రీతిగ తనశరీర బలియిచ్చుకొన్నాడు.
బల్యర్పణ మంతకంటెను హెచ్చగునది యెద్దియునులేదు. కావున యీ బల్యర్పణ
విధి ప్రపంచమంతయు వ్యాపించుననుట కేసందియంబునులేదు. ఆగమవిధానములు
భిన్నములుగనుండినను నుండనిండు. దీనినిబట్టి సమస్తమతములందును నీ మత
విధియు సామాన్యముగనున్నది. కావున మతములందీ విషయమునఁ దరతమములు
లేవని నిర్ధరింపనగును. స్తుతులు బల్యర్పణములు నతిపురాతనములనుటనిస్సందేహము.
అయితే వీనినొనరింపఁదగిన క్రమములు (Rituals) నూతనములు గాకపోయి
నను స్తుతులబలెఁ బురాతనములుకావు. పురాతనమతములలో నీ యాగమ విధా
నములులేవు. ఈ యాగమవిధానములు పురోహితుల యేర్పాటులని మత గ్రంథ
ములఁ జూచినవారెల్లరు గ్రహింతురు. వేదములలో నేమి జన్దవస్థలోనేమి యా
గమవిధులు పలుకంబడినవి. జ్యూలమత గ్రంథములలోసైత మీ యాగమాచరణ
లొనర్పందగిన క్రమములు వచింపఁబడినవి. బౌద్ధులేమి క్రిశ్చియనులేమి యీ యా
గమవిధులు నిర్ధరించిరిగాని నిరాకరింపరైరి. మతసారము మన్నుఁగలసిపోయినను
నాగమాచరణము మాత్రము హెచ్చగుచున్నది. సంధ్యావందనము రాకపోయినను
ముక్కుపట్టుకొనుట ముఖ్యమైనది. శ్రాద్ధములు వేఱయినవి. జనుల నడవడికలు
వేఱయినవి. చిక్కులు బలమైనవి. స్తుతులొకానొక సమయమున హృదయమునఁ
బుట్టి పాటాత్తుగ జిహ్వనుండి వెడలుటకు బదులుగ శాస్త్రమునకుఁజిక్కి ఛందస్సుకు
లోఁబడి యుచ్చారణక్రమమేర్పడి స్వాతంత్ర్యముగోల్పోయి చిక్కులపాల్పడినవి.
పార్శీలు, ప్రాతఃకాలము లేవగనే దేవునిస్తుతింపవలెననియు భోజనాపూర్వము
భోజనానంతరము పడుకకుఁబోవునపుడును గోళ్లు వెండ్రుకలు కత్తరించుకొను సమ
యమునను దైవస్తుతు లొనర్చుటయగాక త్రికాలములందును సూర్యస్తుతు లొనర్చ

వలెనని యాగమవిధు లేర్పడెను. జ్యాలులేచిన క్షణముననె దైవప్రార్థన యొనర్ప వలెననియు నొకవిధమగుబట్టలు తొడుగవలెననియు నొక్కవిధముగ బట్టలుదుకవలెననియు విధులేర్పడెను. మసల్మానులు మక్కాదిక్కునకు మొగమయి దిన మైదుతూరులు దైవప్రార్థనలు సేయవలెననునది నిర్బంధమాయెను. హిందువు లీవిషయమున నెన్ని చిక్కులలోఁ జిక్కిరో నేఁ దెలుపునది యనవసరము. కొన్ని యాగమాచరణ లొనర్పఁ బురోహితులేర్పడిరి. మెక్సికనుల దేవాలయములలో దినమును నాలుగుతూర్లు పూజలొనర్ప పూజార్లేర్పడిరి. క్రిస్టియనుల దేవాలయములలో ప్రాతఃకాల సాయంకాలములందు ప్రార్థనలొనర్చుట యీ యాగమాచరణకు లోఁబడిన విధానమేను. పైన వ్రాయఁబడిన విషయములుగాక పవిత్రకార్యములని సర్వమతములవారు నొనర్చు నాగమవిధులు మఱికొన్ని యున్నవి. వాని పేర్లుమాత్రమీ క్రింద వివరించినాను.

[1] ఉత్సవములు, పండుగలు, ఉపవాసములు, జాగరణములు, జాతకర్మ, నామకరణ, వివాహ, గర్భాధానములు, మరణ మీ మొన్నికర్మములు మతవిధులకుఁ జేరినవేను. అన్ని మతములలోను నీవిధులు సామాన్యముగ నున్నవి. ఆచరణక్రమములు వేఱుగనున్నవి.

ఇఁక మూడవతరగతికిఁ జేరిన పవిత్రస్థలములనుగుఱించి యించుక వ్రాసెద.

అనేకవిధములగు పవిత్రకార్యములొనరించునది ప్రాచీనజనుల ముఖ్యోద్దేశము. దానికిఁ గారణంబు దైవములతో సంబంధముఁ గల్పించుకొనుట. దానికిగాను స్తుతిబల్యాదివిధుల ననుసరించుటయగాక మఱి కొన్ని మార్గములు వెదకికొనిరి. పైరీతిగ మతాభిప్రాయములు హెచ్చినపిదపఁ బ్రాచీనజనులా యభిప్రాయములకుఁ దగినరీతిగఁ గొన్ని స్థలములను కొన్ని వస్తువులను కొందఱుమానవులను పవిత్రులుగ నొనర్చిరి. దైవారాధనలకుఁ దగినవని కొన్ని స్థలములేర్పరచి యందు దైవములను నిలిపిరి. ఆస్థలములందొనర్పఁబడినకార్యము లతిపవిత్రములని తలంచిరి. దైవములతో సంబంధముగలుపుకొనుటకు నవి పావనస్థానములని యెన్నిరి. ఈస్థలము లేర్పరుప సకలమతస్థులు సకలవిధములనిప్పటికిని యత్నించుచున్నారు. తమధనమును వెచ్చించుచున్నారు. అట్టిపవిత్రస్థలములం దే చెడుకార్యములు జేయను భీతిలుచున్నవారు. సాలోమనుకొను హెబ్రూవారు దేవాలయము గట్టించునపుడు స్థలశుద్ధికిగాను 22000 వేల యెద్దులును 12000 వేల గొఱ్ఱెలను నాస్థలమునందు

జంపెనఁట. పిదప దేవాలయముగట్టి "జెహోవా! ఈ పవిత్రస్థళమున నివసింపుము. ఇచట జనుల మొరలాలకింపుము" అనిప్రార్థించెనఁట. ఇజరాయేల్యులు యిప్పటికి నాస్థళమతి పవిత్రముగఁజూచుచున్నవారు. పోంపేయాస్థళమున జెఱుసలేము నటులొనరించినవారి సాహసము చరిత్రలు చదివిన వారికివిశదమగును. మెక్సికనులు పెరూవియనులు హిందువులు క్రిస్టియనులు నీదేవాలయములనుగట్టి నెంతద్రవ్యమును వెచ్చించిరో దైవమునకే దెలుసును. పూర్వకాలంబున హిందువులు గట్టిన దేవాలయములు దేహతత్వమును దెలుపును.

పవిత్రవస్తువులు.

దేవాలయములోనిదైవములకును గృహదేవతలకును భక్తిపూర్వకముగభక్తులు, విశేషముగుద్రవ్యము, సొమ్ములు, పాత్రసామానులు, వస్త్రములు, భూములు, విగ్రహములు, పటములు మొదలగునవి యిచ్చుచున్నారు. ఈవస్తువులతి పవిత్రములుగనెంచి యెవరును వానినిహరింపయత్నింపరు. కొన్నిదేశములందు శక్తులపేరిటపోతులను నెద్దులను స్వేచ్ఛగవిడుచుచుందురు. వానిని నెవరునేవిధముగ నుపయోగింపఁగూడదు. అవిచేనులు దూరి పంటలు చెడుపుచున్నను వానినేవిధముగదండింపఁ గూడదని జనులలోనిబంధన. టార్తారువారు తమ దైవములపేరిట గుఱ్ఱములను వదలుచుండిరి.అట్టి గుఱ్ఱముల నెవరునెక్కఁగూడదు. ఈరీతిఁ బ్రపంచంబు నందెల్లెడ దైవములపేరట వస్తువిశేషములనేకములు వదలంబడి పవిత్రములయి జనులపూజలకు నర్హములగునెను. కొందఱట్టివస్తువులఁ జూచిదైవములేయవియని నమస్కరించి గౌరవించుచున్నవారు; మతతత్త్వమనేక రూపములు గొనెననుటలో నిదియొకటి. ఈతర గతి క్రిందనే యింకను ననేకవిధములున్నవి. దైవమునకనిపేరిడినంతనె వస్తువులందు దైవావేశము కలుగుచున్నదని నమ్మకము.బలులిచ్చినతోడనే దైవముఁభుజించును. వస్తువులిచ్చినచో దైవము తన యుపయోగమునకు దాఁచికొని యుండునని జనుల దృఢాభిప్రాయము, అతిథికినాహారమిడిన భుజించును. వస్తువులను బహుమానముగ నొసంగినవానిని దాఁచిపెట్టును, అటులనేదైవము జేయునని ప్రాచీనజనులు నమ్మిరి.

ప్రారంభమునఁబురాతన మానవులు దైవమున్నవాఁడని ప్రకృతి మహిమలఁజూచి యామహిమలకుఁ గర్తయొకఁడుండునని యూహించిరి. పిదపనుష్యుఁడని నిర్ధరించిరి. వానినిస్తుతించిరి. ఆహారాదులు బలులరూపకముగ నొసంగిరి నివసింపనాలయములనిచ్చిరి. కట్టనుబట్టలిచ్చిరి. తొడుగభూషణములిచ్చిరి. ఎక్కను

వాహనములిచ్చిరి. ఇఁక సేవింప సేవకులు కావలసియుండెను. వారే పవిత్రమానవులుగ నేర్పడిరి. వీరిలోఁ గొందఱు స్వేచ్ఛగ దేవదాసులైరి. మఱికొందఱు జనులచే నిర్బంధింపఁబడి పావనులైరి. స్వేచ్ఛగఁ బవిత్రులయినవారి సంఖ్యవిశేషముగ నున్నది. ఇండియాలోని ఋషులేమి, చైనా, సిలోనులలోఁ బసుపుబట్టలుధరించు జ్ఞానులేమి జ్యూజాతివారిలోనుండిన "యిస్సనీస్స" నువారేమి, ఆఫ్రికా ఏష్యా యూరోపులోనుండు "Monks & Nuns" యేమి యీతరగతికిఁ జేరినవారేను. ప్రపంచంబుననుండు జనులకనేకులను నీరీతిగఁ బవిత్రపురుషులు కావలెనను శతాబ్ద ప్రారంభమున పశ్చిమఖండములోని ముఖ్యపట్టణములోని గొప్పవీథులలో నగ్నిగుండములుంచితమమతములోఁ జేరని వారిని బలవంతముగఁబట్టి తెచ్చియగ్నిలోఁ బడవైచుచుండిరఁట! కొందఱిని గాలములను తవిలించుచుండిరి. మొనలుగలమేకులను జెక్కిన పీపాయిలోఁగొందఱిని వైచివీథులఁగుండా ద్రిప్పిచంపుచుండిరి. కొందఱిని శూలముల బాధించుచుండిరి. ఈరీతిగఁ బదునాఱవశతాబ్దాంత్యమువరకుఁ దమతమ మతవ్యాప్తికిగాను జనులు పెఱమతము వారినిఁ జిత్రహింసలు పెట్టుచుండిరి. పిదప వారియందేజ్ఞానముద్భవిల్లిమతవాదములు పిచ్చిపిచ్చిగఁ బెఱుగనీయక కలహములనాపి యిపుడుసుఖముగనున్నవారు.

ఋగ్వేదమటు కలహములకు దిగక, జనులను బాధింపక, యెవరికి నే హింసలిడక బహుపురాతనకాలమునుండి యొక్కవిధముగఁ జెన్నారుచున్నది. పురాతనార్యులు దస్యులను బాధించిరనిన నందులకుఁగారణము మతముకాదు. సుఖవృత్తిని జీవించు నార్యులపైబడి దస్యులు హింసించునపుడు వారి క్రూరకృత్యములకు సైఁపనోపక యార్యులు తమప్రాణరక్షణమునకునై దస్యులతోఁబోరి వారినినోడించి. వారినే మఱలఁ దమసేవకులుగఁగైకొని వారిదుర్వృత్తినిఁ బోకార్చి కృషివాణిజ్యాది కర్మములు వారికిఁగఱపి వారికిని విద్యాబుద్ధులను నాగరికతయు నేర్పిరి. సులభముగునట్టియు యమాయకమగునట్టియు శుద్ధమగునట్టియు వేదమతమును దూలనాడి యిటీవల జనుల బుద్ధికౌశల్యమునఁబుట్టి పెక్కు చిక్కులలోఁ జిక్కినమత విధులనుఁగైకొని వైషమ్యవిశేషమున ద్వేషములుబెంచుకొని యైకమత్యమును విడనాడిరి.

ప్రకటన.

బళ్లారిలో వకీలుగానుండి కీ. శే. కోలాచలం శ్రీనివాసరావుగారిచే రచియింపబడిన యీక్రింద వివరించిన యుపన్యాసములన్నియును విక్రయమునకుసిద్ధముగనున్న యవి.

1.	ఆర్యుల నాగరికత వారి ప్రపంచవ్యాపకత.	0-8-0
2.	ఆర్యుల చరిత్ర, ఋగ్వేదభాష మొదలగునవి.	0-8-0
3.	ఋగ్వేద విభజన వేదకాల విభజన మొదలగునవి.	0-8-0
4.	ఆర్యులుపంజాబు చేరిన విధము వారిశాసనము.	0-8-0
5.	మద్యపానము జూదము స్త్రీలగుణములు మొదలగునవి.	0-8-0
6.	వివాహకట్టడములు ...	0-8-0
7.	జాతిచట్టములు ...	0-8-0
8.	సృష్టిని గుఱించిన తాత్పర్యము.	0-8-0
9.	వేదమతము నాస్తికమతము ఆర్యులదైవములు.	0-8-0
10.	నరమేధ అశ్వమేధాది యజ్ఞములు.	0-8-0
11.	అదితి ద్వాదశాదిత్యులు మొదలగునవి.	0-8-0
12.	యమ యమి మృత్యువు పితృదేవతలుకర్మ మొదలగునవి	0-8-0
13.	సోమపానము అశ్వినులు రుద్రుఁడు పర్జన్యుఁడు.	0-8-0
14.	ఋషులు, సప్తర్షులు, దధీచి, చ్యవనుఁడు మొదలగునవి.	0-8-0
15.	ఋగ్వేదములోని ముఖ్యప్రార్థనలు	0-8-0
16.	మతవిధులేరీతిగఁ బ్రబలినది ...	0-8-0

వలయువారు ఈక్రింది చిరునామాకు వ్రాయవలయు.

కై. శత్రుఘ్నరావు,
సివిల్ లైన్సు, బళ్లారి.